క్లుప్తంగా

మద్యం బాటిళ్లు స్వాధీనం

చిట్యాల : మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన ఏరుగొండ గణపతి కిరాణం షాపులో అక్రమంగా 83 మద్యం (బీరు)బాటిళ్లు విక్రయిస్తున్నాడు. కాగా బుధవారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు సురేష్ గోపాలపురంలో పెట్రోలింగ్ చేస్తుండగా మద్యం పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. అట్టి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్ తీసుకువచ్చి గణపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అశోక్, రమేష్ పాల్గొన్నారు.

నిందితుడిపై కేసు నమోదు

టేకుమట్ల : నిషేధిత గుడుంబాను పట్టుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వివరాలను బుధవారం వెల్లడించారు. హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య, కానిస్టేబుల్ మహేందర్ మండలంలోని వెలిశాలలో పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని గిద్దెముత్తారం తండా గ్రామానికి చెందిన సునావత్ సమ్మయ్య అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని అతడి వద్ద ఉన్న సంచిని తనిఖీ చేయగా 10 లీటర్ల గుడుంబా ప్యాకెట్లు గుర్తించారు. వెంటనే గుడుంబాను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పగిలిన డ్రెయినేజీ పైపులైన్



భూపాలపల్లి అర్బన్ : పట్టణ సమీపంలోని చెల్పూర్ వైపు వెళ్లే జాతీయ రహదారిపై మురికి నీరు ప్రవహిస్తుంది. జవహర్‌నగర్ కాలనీలో నివాసగృహాల నుంచి వచ్చే మురికినీరు బయటికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్ పగిలిపోయింది. గత రెండు నెలలుగా మురికి నీరు జాతీయ రహదారిపై ప్రవహిస్తున్నా మున్సిపాలిటీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో సమీపంలోని నివాసిత కుటుంబాలు, బాటసారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

గిరిజనులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

నెహ్రూసెంటర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో గిరిజన సామాజికవర్గ ప్రజాప్రతినిధులకు మంత్రిమండలిలో చోటు కల్పించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ అన్నారు. మానుకోటకు వచ్చిన ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజేష్‌నాయక్ మాట్లాడుతూ.. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని, రిజర్వేషన్ పెంపు, జీపీలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించి అభివృద్ధి కోసం బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సీఎం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారన్నారు. కార్యక్రమంలో సంఘం , భూక్య బాలాజీనాయక్, పదో వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీనునాయక్, భూక్య సంతోష్‌నాయక్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైలెన్సర్లు మార్పిడి చేస్తే కఠిన చర్యలు

కాజీపేట: ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పిడి చేసి రహదారులపై తిరుగుతూ భయకరమైన శబ్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నిస్తే సదరు వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ నాగబాబు హెచ్చరించారు. సైలెన్సర్లు మార్చిన ఏడు వాహనాలను కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ వాహనాల సైలెన్సర్లను తొలగించారు. వాహనాలపై తిరుగుతూ పట్టుబడిన యువకులకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు.

'విద్యార్థి మృతికి బాధ్యులైన వారిని శిక్షించాలి'

నల్లబెల్లి : భువనగిరిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి ప్రశాంత్ (12) మృతికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని నల్లబెల్లి ఎంపీటీసీ జన్ను జయరావు, దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి వారు బుధవారం లేఖ పోస్టు చేశారు. అనంతరం మీడియాతో జయరావు, సాంబయ్య మాట్లాడారు. పాఠశాలలో కలుషిత ఆహారం తిని 28 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్, వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. వారిని సర్వీస్ నుంచి తొలగించాలని, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ములుగు రూరల్: మహ్మద్‌గౌస్‌పల్లిలో మంగళసూత్రాన్ని భక్తులకు చూపుతున్న అర్చకులు



కన్నాయిగూడెం: కల్యాణతంతును తిలకిస్తున్న భక్తులు



వెంకటాపురం(కె) : అప్పాలవారి వీధిలో కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు, పాల్గొన్న దంపతులు



వైభవంగా రాములోరి కల్యాణం

శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ములుగు, ఏటూరునాగారం, గోవిందరావుపేట, కన్నాయిగూడెం, వెంకటాపురం(ఎం), వాజేడు, వెంకటాపురం(కె) మండలాలతో పాటు ఆయా గ్రామాల్లో కల్యాణ వేడుకలు నిర్వహించారు. వేదిపండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీతారాములకు కల్యాణం జరిపించి తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడులు తిలకించేందుకు ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పలువురు ప్రముఖులు పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భద్రాచలం నుంచి తీసుకువచ్చిన ముత్యాల తలంబ్రాలను స్వామివారి ఉత్సవ విగ్రహాలకు సమర్పించారు. కల్యాణతంతు అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం దాతలు, ఆలయ కమిటీ సభ్యులు చేపట్టారు. ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఏటూరునాగారం: తలంబ్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువస్తున్న భక్తులు



ములుగు రూరల్: కల్యాణ వేడుకకు హాజరైన భక్తులు



గోవిందరావుపేట: చల్వాయిలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో తాళిబొట్టును చూపుతున్న పండితులు



వెంకటాపురం(కె): కల్యాణ వేడుకను తిలకిస్తున్న మహిళలు



ఏటూరునాగారం: తలంబ్రాలను పోస్తున్న అర్చకులు



వాజేడు: పేరూరులో..



వాజేడు: ధర్మవరంలో ..



మంగపేట: ఉత్సవమూర్తులతో వస్తున్న భక్తులు



మంగపేట: నర్సింహసాగర్‌లో..



ఎస్ఎస్ తాడ్వాయి: శివాలయంలో సీతారాముల కల్యాణం..



తాడ్వాయి : కాటాపూర్ రామాలయం వద్ద అన్నదానం

ప్రకృతివనంలో చెట్ల నరికివేత



కొత్తగూడ: మండలంలోని వేలుబెల్లి మెగా పల్లెప్రకృతి వనంలోని చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రెండేళ్ల క్రితం అయిదు ఎకరాల్లో మెగా పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. ఏపుగా ఎదిగాయి. రెండు రోజుల క్రితం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లు నరికేశారు. సుమారు 15వేల చెట్లు నరికినట్లు అధికారులు గుర్తించారు. కాగా పల్లె ప్రకృతి వనం భూమిని ఆక్రమించుకునేందుకే చెట్లు నరికి ఉంటారని గ్రామంలో చర్చ జరుగుతోంది. ఘటనపై కొత్తగూడ పోలీస్ స్టేషన్‌లో అధికారులు ఫిర్యాదు చేశారు.

వాహనాలు స్వాధీనం

దామెర: అక్రమంగా మొరం తరలిస్తున్న వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మండలంలోని సింగరాజుపల్లి శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కొందరు అనుమతులు లేకుండా జేసీబీతో మొరం తవ్వకాలు చేపట్టి నాలుగు ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరకొని ఒక జేసీబీ, నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నివాళి

నర్సంపేట : పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ 12వ వార్డు కమిటీ అధ్యక్షుడు గుడికందుల సంతోశ్ తండ్రి రాములు బుధవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్, బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు బుధవారం వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు మహ్మద్ మసూద్, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు మెరుగు సాంబయ్య, 13వ వార్డు ఇన్‌చార్జ్ శ్రీరామోజు మురళి, 20వ వార్డు అధ్యక్షుడు రామగోని శ్రీనివాస్, బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్, జిల్లా నాయకుడు కందగట్ల నాగరాజు, రాష్ట్ర సోషల్ మీడియా నాయకులు మైండ్ల గగన్‌కుమార్, తదితరులు నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

చేయూత

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో ఇటీవల మరణించిన హసన్‌పర్తికి చెందిన గుడికందుల చంద్రయ్య కుటుంబానికి క్లాస్‌మెంట్స్ (1988 -99 ఎస్ఎస్‌సీ బ్యాచ్) చేయూతనిచ్చారు. ఈమేరకు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.21 వేల విలువ గల చెక్కును బుధవారం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అజ్ఞాతం వీడండి.. సహకరిస్తాం



ఏటూరునాగారం : అర్జున్ కుటుంబ సభ్యులకు పండ్లు అందజేస్తున్న ఎస్సై



గోవిందరావుపేట: సాంబయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

గోవిందరావుపేట: అజ్ఞాతాన్ని వీడి మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని, వచ్చిన మావోలకు ప్రభుత్వం తరఫున పూర్తిగా సహకరిస్తామని పస్రా సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన మావోయిస్టు కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ అలియాస్ గోపన్న కుటుంబానికి ములుగు ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు పస్రా పోలీసులు చేయూతనందించారు. ఈ సందర్భంగా సీఐ సాంబయ్య తల్లితండ్రుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసులను సంప్రదిస్తే చేయూతనందిస్తామని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తరఫున అందించాల్సిన సహాయ సహకారాలు అందుతాయని చెప్పారు. తుపాకి ద్వారా రాజ్యాధికారం సాధించవచ్చనే అపోహతో అజ్ఞాతంలోకి వెళ్లిన ప్రభుత్వం ఎదుట లొంగిపోయి తల్లిదండ్రులు, కుటుంబంతో కలిసి జీవించాలని అన్నారు. అజ్ఞాతల నాయకులు ములుగు ఎస్పీ ఎదుట లొంగిపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై, పోలీసులు పాల్గొన్నారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి

ఏటూరునాగారం : మావోయిస్టు పార్టీలో ఉన్న వారు జనజీవన స్రవంతిలోకి వస్తే ప్రభుత్వం, పోలీసు శాఖ నుంచి సహకారం అందిస్తామని ఎస్సై జి.కృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని గోగుపల్లికి వెళ్లి మావోయిస్టు పార్టీలో అజ్ఞాతంలో ఉన్న ఈసం అర్జున్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. ఎస్పీ ఆదేశాలతో మావోయిస్టు పార్టీలో ఉన్న వారి కుటుంబ సభ్యులను కలుస్తున్నామని, అజ్ఞాతంలో ఉన్న వారిని జనజీవన స్రవంతిలో పిలుపునిస్తున్నామని తెలిపారు. ఎవరైనా మావోయిస్టుల సమాచారం తెలిస్తే తెలపాలని, వారికి ఎలాంటి హాని లేకుండా చూస్తామని తెలిపారు.

అడుగంటిన భూగర్భజలాలు

● నీటి కోసం రైతుల తపన

రేగొండ : ఈ ఏడాది వానాకాలంలో సరైన వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో పలుచోట్ల బోర్లు, వ్యవసాయ బావుల్లో నీరు పాతాళానికి పడిపోయింది. అయితే మొక్కజొన్న, వరి పంటలకు నీరు అవసరం ఉండడంతో రైతులు ఏ అవకాశాన్ని వదలకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడక్కడా పాత బావుల్లో చెత్తాచెదారం, పూడిక పేరుకుపోగా పొక్లెయినర్ ద్వారా తీయిస్తున్నారు. అలాగే బోర్లు, బావులను మరింత లోతు తీయించే పనుల్లో నిమగ్నమయ్యారు. కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్, కొత్తపల్లిగోరి, నిజాంపల్లి, బాలయ్యపల్లిలో చాలా చోట్ల పూడిక తీయిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.



జగ్గయ్యపేటలో పూడిక తీస్తున్న పొక్లెయినర్

ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



నడికూడ : కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



పరకాల : ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు

పరకాల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పరకాల సీఐ రవిరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రత్యేక పోలీసు బలగాలతో పట్టణంలో బుధవారం కవాతు నిర్వహించారు. జాతీయ జెండాలతో పోలీసులు చేపట్టిన కవాతును ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతం నిర్వహించేందుకు ప్రజలతో పాటు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ఎన్నికల నియామవళిని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్, పోలీసు కానిస్టేబుళ్లు తదితరులు తపాల్గొన్నారు.

నడికూడ: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రతిఒక్కరూ సహకరించాలని సీఐ రవిరాజ్ కోరారు. ఈ మేరకు బుధవారం సీఆర్‌పీఎఫ్ బెటాలియన్, పరకాల పోలీసులు మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న సునీల్

శాయంపేట : సేంద్రియ ఎరువులైన పేడ, చెరువు మట్టి, పచ్చిరొట్ట లాంటి కంపోస్ట్ ఎరువులను వినియోగించడం ద్వారా వ్యవసాయ భూమిలో భూసారం పెరిగి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రజ్వల్ సంస్థ కార్యకర్త పోతు సునీల్ అన్నారు. మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో బుధవారం హెచ్‌అండ్ ఎం ఆర్థిక సహకారంతో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. రైతులందరూ వ్యవసాయ భూముల్లో రసాయనిక పురుగుమందులు అధికంగా వినియోగించడం వలన సారవంతమైన నేలలు కనుమరుగవుతున్నాయని, నిస్సహాయత వ్యవసాయ భూములుగా మారుతున్నాయని అన్నారు. రైతులందరూ వ్యవసాయ క్షేత్రాల నుంచి మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షల చేసుకోవడం ద్వారా వచ్చే ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రాంతంలో ఎస్‌పీకే పోషకాలు అధికంగా ఉన్నాయని, సేంద్రియ కర్బనం తక్కువగా ఉండటం వలన సరైన దిగుబడి రావడం లేదన్నారు. సేంద్రియ కర్బనాన్ని పంట క్షేత్రాల్లో వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

యువరైతుకు సన్మానం

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన యువరైతు నరేశ్‌ను 12 గ్రామాలకు చెందిన రైతు మిత్ర సంఘాల సభ్యులు బుధవారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నరేశ్ యాసంగిలో 2 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసి అధిక దిగుబడి సాధించాడు.

ప్రధానోపాధ్యాయుడి మృతికి సంతాపం



వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీఆర్‌కే పురం ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న శేషాచలం (55) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన మృతిపై రాష్ట్ర టీచర్స్ యూనియన్ మండల, జిల్లా కమిటీ సభ్యులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, రాష్ట్ర కార్యదర్శి సోలం క్రిష్ణయ్యలు శేషాచలం ఇంటికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారివెంట ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి రమణయ్య, గోవిందరావుపేట మండల అధ్యక్షుడు కందిక రాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.